

ఆన్‌లైన్ చెల్లింపులను ప్రోత్సహించాలి

ఆన్‌లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపులను ప్రోత్సహించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు సూచించారు.

- 8లో▸



జాతర ఏర్పాట్లకు ముందస్తు ...

2024 ఫిబ్రవరిలో జరుగనున్న మేడారం మహాజాతర విజయవంతానికి ముందస్తు కార్యాచరణ చేపడుతున్నామని మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం

$33^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల చిరుజల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

బీసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా శివ



ఖానాపురం: మండలంలోని ధర్మరావుపేట గ్రామానికి చెందిన ఊరుగొండ శివను బీసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించినట్లు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బట్టి శ్యాంయాదవ్ తెలిపారు. ఈ మేరకు వరంగల్‌లో సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ బీసీల హక్కుల సాధన కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. హక్కుల సాధనలో బీసీలంతా ఏకతాటిపై ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తన ఎంపికకు సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా బ్యాంకులో గోరింటాకు సంబురం



నర్సంపేట: ఆషాఢ మాసం సందర్భంగా పాకాల మహిళా బ్యాంకులో సోమవారం గోరింటాకు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాకాల మహిళా బ్యాంకు అధ్యక్షురాలు పెండెం రాజేశ్వరి మాట్లాడుతూ ఆషాఢమాసంలో నిండు ముత్తయిదువలు సంప్రదాయకంగా చేతులకు గోరింటాకు పెట్టుకుంటారన్నారు. అనంతరం మహిళలు అందరూ వివిధ ఆకృతుల్లో గోరింటాకు పెట్టుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాకాల మహిళా బ్యాంకు పాలక వర్గ సభ్యులు ఇమ్మడి పద్మ, రాపాక మాణిక్యం, గాదెగోని నిర్మల, మండల పద్మ, గండు శ్రీదేవి, దేవులపల్లి వాణి, నల్ల భారతి, గుర్రపు అరుణ, గిరగాని హైమావతి, సామల ఉమా, పాలడుగుల అనిత, హైమావతి, పెండెం స్పందన, జానకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్‌గా పదోన్నతి, బదిలీ



నర్సంపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డీఓలుగా విధులు నిర్వహిస్తున్న పలువురికి అడిషనల్ కలెక్టర్లు, కలెక్టర్లుగా పదోన్నతి కల్పించింది. అందులో భాగంగా రెండు సంవత్సరాలుగా నర్సంపేట ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులుకు అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా పదోన్నతి లభించింది. నర్సంపేట ఆర్డీఓగా పని చేసిన శ్రీనివాసులును జోగులాంబ గద్వాల అడిషనల్ కలెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటి రెండు రోజుల్లో జోగులాంబ గద్వాల అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

'ఇంటింటా ఇన్నోవేటర్'కు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్/కాశీబుగ్గ సెంటర్: గ్రామీణ ఆవిష్కర్తలను ప్రోత్సహించేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీవత్స, ఆర్డీఓలు మహేందర్‌జీ, శ్రీనివాసులు, డీఆర్డీఏ సంపత్‌రావు, జేడీ అగ్రికల్చర్ ఉషా దయాల్, డీఈఓ వాసంతి తదితర శాఖల అధికారులతో కలిసి ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ) ఆధ్వర్యంలో 2023 సంవత్సరానికి గాను విద్యార్థులు, రైతులు, మహిళలు, విద్యావేత్తలు ఎవరైన ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. ప్రాజెక్టు రూపకర్తలు తమ ప్రయోగ ఆవిష్కరణలను కేవలం వాట్సాప్ ద్వారానే ఆగస్టు 5వ తేదీలోపు పంపాలన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి ఆరు వాక్యాలు, రెండు నిమిషాల నిడివి ఉన్న వీడియో, నాలుగు ఫొటోలు, ఆవిష్కర్త ఫొటో, చిరునామాను 9100678543 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు.

రేపటి నుంచి పీజీ సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: ఈనెల 5వ తేదీ నుంచి పీజీ కోర్సుల సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జ్యోతి తెలిపారు. కేయూ పరిధిలోని జిల్లాల్లో అన్ని కోర్సుల సెకండియర్ విద్యార్థులకు రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి అంతంతే!

వర్ధన్నపేట మున్సిపాలిటీలో సాగు..తున్న అభివృద్ధి పనులు

- ఏడాది దాటుతున్నా.. నగంలోనే సమీకృత మార్కెట్ నిర్మాణం
- సరిగా లేని డ్రెయినేజీలు, అపరిశుభ్రంగా ఉండడంతో దుర్వాసన
- ఎమ్మెల్యే నిధులు తెస్తున్నా.. అధికారుల అలసత్వమనే వాదనలు
- సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలంటున్న జనం



కొనసాగుతున్న సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు



మురుగు కాల్వలో నిలిచిన నీరు



విద్యుత్ స్తంభాలు తొలగించకపోవడంతో ఆగిన రహదారి నిర్మాణ పనులు

సాక్షి, వరంగల్: వర్ధన్నపేట మున్సిపాలిటీలో ఓవైపు అభివృద్ధి పనులు జరుగుతున్నా.. మరోవైపు అదే స్థాయిలో సమస్యలు ఉండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. 2018 నుంచి 2023వరకు వివిధ అభివృద్ధి పనుల కింద రూ.89.36 కోట్లు మంజూరైనా.. మున్సిపాలిటీలో మాత్రం మురుగునీటి దుర్వాసన తప్పడం లేదు. 12 వార్డులున్న ఈ మున్సిపాలిటీలో చాలా చోట్ల డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతోపాటు వాటిని అడపా దడపా శుభ్రం చేస్తుండడంతో కంపు వాసన వస్తోంది. దోమలు వృద్ధి చెంది జనాలు అనారోగ్యం బారిన పడుతున్నారు. కొన్నిచోట్లా మిషన్ భగీరథ నీరు రాక.. ఉన్నా బోర్‌లతో దాహార్తిని తీర్చుకుంటున్నారు. వంశీరాజనగర్, బ్లాక్ ఆఫీసు ఏరియా, ప్రధాన రహదారి వెంట నీటి సమస్య ఉంది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి సైతం మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో బోర్ వాటర్‌ను వినియోగిస్తున్నారు.

సాగు..తున్న సమీకృత మార్కెట్ పనులు..

2022 మే 10న మంత్రి హరీశ్ రావు చేతుల మీదుగా ప్రారంభమైన సమీకృత మార్కెట్ నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. పట్టణవాసులకు కూరగాయలు, మాంసాహారం, పండ్లు అన్నీ ఒకే చోట కల్పించాలన్న ఉద్దేశంతో కూడిన ఈ మార్కెట్ నిర్మాణ పనులు పిల్లర్ల వరకు మాత్రమే జరిగాయి. 2023 ఏప్రిల్ వరకే పూర్తి చేయాల్సిన ఈ పనులు.. ఇంకా 50 శాతం మేర ఉండడంతో ఇంకెన్ని నెలలు పడుతుందోనని చర్చించుకుంటున్నారు. ఇటీవల ఎమ్మెల్యే అరూరి రమేశ్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించడంతో పనుల్లో వేగం పెరిగింది.

పెండింగ్ పనులివే..

- వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిలోని వర్ధన్నపేట ప్రధాన రహదారిలో రోడ్లు, సెంట్రల్ డివైడర్ పనులు దాదాపు రూ.9 కోట్లతో రెండేళ్ల క్రితం చేపట్టారు. డివైడర్ పనులు దాదాపు పూర్తికావొచ్చాయి. మరో 200 మీటర్ల పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. రహదారి పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి.
- రూ.1.75 కోట్లతో మున్సిపాలిటీ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అయితే ఈ నిధులు పూర్తిస్థాయి నిర్మాణానికి సరిపోకపోవడంతో అంతనా వ్యయం మరో రూ.50 లక్షలు వేసి పనులు మొదలెట్టారు. ఈపనులు తుది దశలో ఉన్నాయి.
- దోబీ ఘాట్ పనులు రూ.రెండు కోట్లతో కొద్ది నెలల క్రితం ప్రారంభించారు. దాదాపు 20 శాతంమేర పనులు పూర్తయ్యాయి. ఇది అందుబాటులోకి వస్తే ప్రజలకు ఎంతగానో ఉపయుక్తం కానుంది.
- 2020 ఆగస్టులో భారీ వర్షాలకు వరద వచ్చి వర్ధన్నపేటలోని కొనారెడ్డి చెరువు కట్ట తెగింది. తాత్కాలికంగా రూ.కోటితో ఆ కట్ట నిర్మించారు. అయితే శాశ్వత నిర్మాణానికి రూ.13 కోట్లు మంజూరయ్యాయి. 2023 ఏప్రిల్‌లో ఈ పనులు పూర్తి కావాల్సి ఉన్నా జరగలేదు. రెండు తూముల మరమ్మతు, కట్ట పటిష్టం, మత్తడి మరమ్మతులు చేయాలి.

ఇంకా చేయాల్సిన పనులు..

- వర్ధన్నపేటకు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలోని జగ్గిపేట శివారు టిట్టికుంట తండా వద్ద డంపింగ్ యార్డుకు 12 వార్డుల్లోని చెత్తా చెదారాన్ని తీసుకెళ్లేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా పట్టణంలో ఎక్కడబడితే అక్కడ చెత్తాచెదారం కనిపిస్తోంది.
- వర్ధన్నపేటలోని ఎస్సీ, మాలా కాలనీల్లోకి నీళ్లు వచ్చే అవకాశముంది. పిరంగడ్డ, ఒడ్డెర కాలనీల్లో నిలిచే వర్షపు నీటిని మళ్లించేందుకు మల్లన్న గుడి సమీపంలోని పంట పొలాలకు అధికారులు దారి మళ్లించారు. దీంతో రైతులు ఆ నీరు రాకుండా ఉండేందుకు కట్ట వేశారు. దీంతో నెలన్నర క్రితం అకాలవర్షానికి ఇళ్లలోకి నీళ్లు వచ్చి చేరాయి. దీనిపై మున్సిపాలిటీ అధికారులు దృష్టి సారించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అక్కడి ప్రజలు వేడుకుంటున్నారు.
- శాత్లకుంట తండాలో నీటి సమస్య ఉంది. మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మాణం సమయంలో ఓ రైతు నీళ్లు, కరెంట్ సరఫరా చేశారు. అయితే సదరు కాంట్రాక్టర్ డబ్బులివ్వకుండా వెళ్లిపోవడంతో ఆ రైతు నీటి సరఫరా ఆపేశాడు. దీంతో స్థానికులు వ్యవసాయ బావుల నుంచి మంచి నీళ్లు తెచ్చుకుంటున్న పరిస్థితి ఉంది.

ఎమ్మెల్యే చొరవ చూపినా..

ఎమ్మెల్యే అరూరి రమేశ్ ప్రత్యేక చొరవ చూపి నియోజకవర్గ కేంద్రమైన వర్ధన్నపేట మున్సిపాలిటీకి ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకొచ్చారు. 2018 నుంచి 2023 వరకు రూ.89.36 కోట్లు మంజూరు చేయించారు. అయితే ఈ అభివృద్ధి పనులను వేగంగా చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంతో పనులు నింపాదిగా సాగుతున్నాయనే టాక్ ఉంది. అయితే మంత్రి కేటీఆర్ మంగళవారం వర్ధన్నపేటకు రావాల్సి ఉండగా ఆ పర్యటన రద్దు కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో చర్చ మొదలైంది. త్వరలోనే మళ్లీ పర్యటనపై స్పష్టత రానుంది.

పేదల ఇళ్లకు పట్టాలివ్వాలి

- తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక డిమాండ్
- వేలాది మందితో కలెక్టరేట్ ముట్టడి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

వరంగల్: జిల్లాలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వాలని, ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10లక్షలు కేటాయించాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక వరంగల్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కమిటీ ఆధ్వర్యంలో వేలాది మందితో కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు వచ్చినా పేదలకు సొంత ఇల్లు లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పీఎం ఆవాస్ యోజన పథకం కింద కేంద్రం రాష్ట్రానికి ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అర్హులందరికి డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు చింతమల్ల రంగయ్య, సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సాగర్, ముక్కెర రామస్వామి, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపెల్లి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఖాజ్య సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు సమిండ్ల స్వామి, నాయకులు కోరబోయిన కుమారస్వామి, అరూరి కుమార్, బషీర్, సింగారపు బాబు, అక్కెనపల్లి యాదగిరి, శ్రీధర్, మధుకర్, బోళ్ల సాంబయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

వరంగల్: సమస్యల పరిష్కారానికే ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలో వివిధ సమస్యలపై 67 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు నేరుగా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి చెప్పుకోవాలని, ఇతరుల మీద ఆధారపడొద్దని సూచించారు. గ్రీవెన్స్‌లో భూ సమస్యలు –21, డీటీడీఓ–2, జీడబ్ల్యూఎంజీ–3, ఈ సెక్షన్ కలెక్టరేట్ –3, బీసీడీఓ –2, డీడబ్ల్యూఓ –3, కుడా–1, సీపీ–2, ఎస్సీ కార్పొరేషన్–6, డీఆర్డీఓ –4, వివిధ శాఖలకు ఒక్కొక్క దరఖాస్తు చొప్పున మొత్తం 67 వినతులు వచ్చినట్లు సంబంధిత విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీవత్స, ఆర్డీఓలు మహేందర్‌జీ, శ్రీనివాసులు, డీఆర్డీఏ పీడీ సంపత్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వేతనాలు తీసుకుంటారు.. విధులకు హాజరు కారు!

వర్ధన్నపేట: వర్ధన్నపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కొందరు వైద్యులు నెలనెలా జీతం తీసుకుంటారే కాని విధుల మాత్రం హాజరు కారని, వీరికి ఆస్పత్రి యాజమాన్యం వత్తాసు పలుకుతూ వైద్య సేవలు గాలికి వదిలేస్తున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఈరెల్లి శ్రీనివాస్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశాడు.

ఊరిస్తున్న మేఘాలు



ఆకాశంలో కమ్ముకున్న మేఘాలు

చెన్నారావుపేట: విత్తనాలు విత్తి వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులను తెల్లని దూదిలా మేఘాలు ఊరిస్తున్నాయి. వాటిని చూసిన రైతులు వర్షాలు పడతాయని మురిసిపోతున్నారు. కానీ వర్షించాలా.. వద్దా! అన్నట్లుగా మేఘాలు ఆశపెడుతున్నాయి. దీంతో వర్షాలు కురవాలని రైతులు కప్పతల్లి ఆటతో పాటు ఆలయాల్లో పూజలు చేస్తున్నారు.

విత్తన ఎంపిక ముఖ్యం

- ఏడీఆర్ డాక్టర్ ఉమారెడ్డి



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఉమారెడ్డి

నెక్కొండ: వ్యవసాయ సాగులో రైతులు మేలైన, అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాల ఎంపిక ముఖ్యమని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన ఏడీఆర్ డాక్టర్ ఉమారెడ్డి అన్నారు. మండలంలోని బంజరుపల్లి శివారు ధర్మాతండాలో సోమవారం వరంగల్- 962 రకం విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ రకం విత్తనాలపై ఆయన వివరణ ఇస్తూ.. గింజ రాలదు, పంటవాలదన్నారు. బీపీటీ–5204 యొక్క రకాన్ని పోలి ఉండి, వరంగల్‌లో ఆ రకానికి ప్రత్యామ్నాయంగా సాగు చేసుకోవచ్చునని తెలిపారు. 120–135 రోజుల పంటకాలం కలదని, ఎకరానికి 28 నుంచి 32 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్. దామోదర్‌రాజు, డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ జి. వీరన్న, డాక్టర్ బి. సతీష్ చంద్ర, ఏఓ ఎగిడి నాగరాజు, సర్పంచ్ బాదావతు స్వరూప, ఉప సర్పంచ్ నరిశెట్టి రాజశేఖర్, ఏఈఓలు ఎం. రంజిత్‌కుమార్, ఎన్. రాజీవ్‌లోచన్, ఎ. రాజేష్, రైతులు బాదావతు రవినాయక్, కొంగ శ్రీనివాస్, బోడ రమేష్‌బాబు, రవీందర్, శ్రీనివాస్, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేటలో..

నర్సంపేట రూరల్: అధిక దిగుబడులు సాధించాలంటే మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ రీజినల్ మేనేజర్ రాజు, సీడ్స్ ఆఫీసర్ నవ్యశ్రీలు తెలిపారు. నర్సంపేట మండలంలోని పలు గ్రామాల్లో విత్తన రథం ద్వారా వరి విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో మేలైన విత్తనాలు అందించటమే లక్ష్యంగా తెలంగాణ సీడ్స్ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కృష్ణ, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళీ.. శరణం మమ



మహాశాకంబరిదేవిగా దర్శనం..

చారిత్రాత్మక శ్రీభద్రకాళి దేవాలయంలో తిథిమండల దేవతాయజన పూర్వక శాకంబరి నవరాత్రోత్సవాల చివరిరోజు సోమవారం ఉదయం అమ్మవారిని మహాశాకంబరిదేవిగా అలంకరించారు. అలంకరణలో నాలుగు టన్నుల కూరగాయలు, పండ్లు, దుంపలను వినియోగించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. గత నెల 19వ తేదీ ఆషాఢ శుద్ధ పాడ్యమి సోమవారం ఉత్సవాలు ప్రారంభమై పక్షం రోజులుగా ఒక్కో క్రమంలో పూజలందుకుంటూ ఆషాఢ శుద్ధ పౌర్ణమి సోమవారం అమ్మవారు పరిపూర్ణ శాకంబరిదేవిగా భక్తులను అనుగ్రహించింది.

– హన్మకొండ కల్చరల్

– వివరాలు 8లో▸

పట్టాల పంపిణీ వేగవంతం చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

వరంగల్: జిల్లాల్లో పోడు భూముల పట్టాల పంపిణీ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పోడు భూముల పట్టాల పంపిణీ పురోగతిని సమీక్షించారు. గృహలక్ష్మి పథకం, ఎరువులు, విత్తనాల నిల్వలు, తెలంగాణకు హరితహారం, బీసీ చేతివృత్తుల వారికి ఆర్థిక సాయం, గొర్రెల పంపిణీ పథకం, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వానాకాలం సీజన్‌లో లబ్ధిదారులకు రైతుబంధు పథకం కింద ఆర్థిక సాయం అందించాల్సి ఉన్నందున రాష్ట్ర వ్యాప్తంగా పోడు పట్టాల పంపిణీని వేగవంతం చేసి వారంలోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. పోడు రైతుల బ్యాంకు ఖాతాల వివరాలను రైతుబంధు పోర్టల్‌లో నమోదు చేయాలని, రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, తాజాగా చెట్లను నరికివేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎరువులు, విత్తనాల నిల్వలపై ప్రతిరోజు పరిస్థితిని పర్యవేక్షించాలని, జిల్లాలో తగినంత నిల్వలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉన్నందున ఈ ఏడాది ఆయిల్ పామ్ ప్లాంటేషన్ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌పై వినూత్న మార్గాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించాలి

కలెక్టర్ తమ జిల్లాలోని రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించి, ఆ మిల్లులు ఏ సామర్థ్యంతో పని చేస్తున్నాయో తెలుసుకోవాలని, మిల్లుల్లోని స్టాక్ పొజిషన్‌ను కూడా సరిచూసుకోవాలని సీఎస్ ఆదేశించారు. ఇంకుడు గుంతల పనులు పూర్తి చేయాలని, హరితవనాలు, దశాబ్ది సంపద వనాలపై దృష్టి సారించాలన్నారు. వర్షాలు కురవగానే మొక్కలు నాటించాలని ఆదేశించారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాలు మొక్కలతో నిండి ఉన్నందున తోటలను ఎక్కడ చేపట్టాలనే దానిపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను కోరారు. బీసీ చేతివృత్తిదారులకు ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులన్నింటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శిశువు విక్రయంపై విచారణ



అనూషను విచారిస్తున్న అధికారులు

నెక్కొండ: ఆడ శిశువు విక్రయంపై సోమవారం నెక్కొండ తండా జీపీలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ, డీసీపీఓ సరితారెడ్డి విచారణ చేపట్టారు. తండాకు చెందిన బోడ అనూష నాల్గో సంతానంగా మరో ఆడ శిశువుకు గత నెల 28న వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రిలో జన్మనిచ్చిన విషయం విదితమే. 30న శిశువును వదిలి తల్లి ఒక్కతే తండాకు రావడంతో శిశువు విషయంపై వారు విచారించారు. అదే రోజు వరంగల్ గొర్రెకుంటకు చెందిన గుడిపాక కుమారస్వామి– కవిత దంపతుల మధ్యవర్తిత్వంతో మరొకరికి శిశువును ఇచ్చారు. ఈ విషయమై మధ్యవర్తులను ఫోన్‌లో విచారించగా తాము అందుబాటులో లేమని తెలిపారు. దీంతో వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ ఆశ్రయించామన్నారు. మధ్యవర్తులు వస్తేనే ఎవరికి ఇచ్చారు.. ఎంతకు విక్రయించారన్న వివరాలు వెల్లడి కానున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

విద్యకు దూరం చేస్తున్న బీఆర్ఎస్



మూతబడిన పాఠశాల ఎదుట బీఎస్పీ నాయకులు

రాయపర్తి: బీఆర్ఎస్ ప్రభుత్వం బహుజనులను విద్యకు దూరం చేయడంకోసమే పాఠశాలలను మూసివేస్తుందని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ నీర్మాల రత్నం, నియోజకవర్గ అధ్యక్షుడు జిలుకర రవికుమార్, ఉపాధ్యక్షుడు పడమటింటి భాస్కర్ అన్నారు. సోమవారం మండలంలోని అరెగూడెంలో మూతబడిన ప్రాథమిక పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 8 ప్రభుత్వ పాఠశాలలు మూతబడినట్లు తెలిపారు. పాఠశాలలో పిల్లలు లేరనే సాకుతో ప్రభుత్వ పాఠశాలలను మూసి వేసి ప్రైవేట్ పాఠశాలల ఆదాయాన్ని పెంచేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం యోచిస్తుందన్నారు. ఇప్పటికైనా పాఠశాలలను తెరిపించేందుకు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. బహుజనులంతా రాజ్యాధికారాన్ని సాధిస్తేనే ఇలాంటి చర్యలు పునరావృతం కావన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత విద్య, ఉచిత వైద్యం సాధించుకుందామని, రానున్న ఎన్నికల్లో నీలిజెండా ఎగురవేసేందుకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ కోశాధికారి చిలుముల కృష్ణ, నీలాద్రి తదితరులు పాల్గొన్నారు.

8 ప్యాసింజర్ రైళ్లు రద్దు

కాజీపేట రూరల్: రైల్వే ట్రాక్ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో 8 ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు సోమవారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట జంక్షన్, వరంగల్ మీదుగా వివిధ మార్గాల్లో ప్రయాణించే పలు ప్యాసింజర్ రైళ్లను జూలై 3 నుంచి 9వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రద్దయిన రైళ్లు ఇవే..

కాజీపేట–డోర్నకల్ (07753) ప్యాసింజర్, డోర్నకల్–కాజీపేట (07754), కాజీపేట–సిర్పూర్ (17003), బల్లార్షా–కాజీపేట (17004), సికింద్రాబాద్–వరంగల్ (07462) పుష్‌పుల్, వరంగల్–హైదరాబాద్ (07463) పుష్‌పుల్, కాజీపేట–బల్లార్షా (17035) రామగిరి, బల్లార్షా–కాజీపేట (17036) రామగిరి ప్యాసింజర్లను రైల్వే అధికారులు రద్దు చేశారు.

క్లుప్తంగా

ఎర్రబెల్లికి కేసీఆర్ ఆశీస్సులు..



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల: పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన జన్మదినాన్ని (మంగళవారం) పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్.. మంత్రి ఎర్రబెల్లికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు అందించారు. అలాగే కేబినేట్ సమావేశం అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ కూడా మంత్రి ఎర్రబెల్లి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఏటా తన జన్మదిన వేడుకలను విదేశాల్లో జరుపుకుంటున్న మంత్రి దయాకర్‌రావు.. సోమవారం రాత్రి అమెరికా బయలుదేరారు.

బీసీలు ఎదగకుండా కుట్ర..



మాట్లాడుతున్న కూరపాటి వెంకటనారాయణ

నయీంనగర్: బీసీలు రాజకీయంగా ఎదగకుండా కుట్రలు జరుగుతున్నాయని తెలంగాణ బీసీ సంఘాల ఉద్యమకారులు అన్నారు. ఈ మేరకు సోమవారం హన్మకొండ హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇందూర్ జిల్లాలో కొందరు బీఆర్ఎస్ నాయకులు.. బీసీ కులాలను కించపరిచేలా వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ముదిరాజ్ కుటుంబాలను సామాజిక బహిష్కరణ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. బీసీలు రాజకీయంగా ఎదగకుండా ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి వంటి వారిని ప్రభుత్వమే ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి రావుల జగదీశ్వర్ ప్రసాద్, పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకుడు చందా మల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పాశికంటి రాజేంద్రప్రసాద్, రజక సంఘం నాయకుడు లక్ష్మీనారాయణ, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు నాగవెళ్లి సురేష్, బట్టి శ్యాం యాదవ్, తాళ్ల సంపత్, మేర సంఘం నాయకుడు మంద వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహా శాకంబరిదేవిగా దర్శనం..
- ముగిసిన ఉత్సవాలు
- పులకించిన భక్తులు

హోమం మహాపూర్ణాహుతి



సీపీ దంపతులకు శేషవస్త్రాలు అందజేస్తున్న ఈఓ



భద్రకాళీ.. శరణం మమ



అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయంలో శాకంబరీ నవరాత్రోత్సవాల చివరిరోజు సోమవారం ఉదయం అమ్మవారిని మహాశాకంబరిదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని భద్రకాళి శరణం మమ అంటూ పులకించిపోయారు. ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ముఖ్య అర్చకులు పార్నంది నరసింహామూర్తి, చెప్పెల నాగరాజుశర్మ , టక్కరసు సత్యం, సోమసుందరశర్మ తదితరులు అలంకరణలో పాల్గొన్నారు. ఉదయం మిత్రాక్రమంలో, చిత్రాక్రమాలలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని మహాశాకంబరీదేవిగా అలంకరించి మహాహారతి, పంచహారతి, మహానివేదన జరిపారు. శాకంబరీ అలంకరణలో ఐదు టన్నుల 80 రకాల దుంపలు, కాయలు, ఆకుకూరలు, కూరగాయలు, 70 రకాల పండ్లను వినియోగించారు. మండువ శేషగిరిరావు, రేణుక దంపతులు, హైదరాబాద్‌కు చెందిన ఈమని హరికృష్ణ , స్మిత దంపతులు శాకంబరీ అలంకరణ దాతలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, సిబ్బంది నాగులు, చింతశ్యామ్ సుందర్, ఇతర సిబ్బంది ఏర్పాట్లను నిర్వహించారు. భద్రకాళి సేవాసమితి అధ్యక్షుడు అయితా గోపినాథ్, సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రముఖుల సందర్శన..

ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ రేవతి దంపతులు, మేయర్ గుండు సుధారాణి దంపతులు, హనుమకొండ జిల్లా న్యాయమూర్తి కృష్ణమూర్తి, నగర సీపీ రంగనాథ్ దంపతులు, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్- పద్మ దంపతులు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ..

- పలువురికి తీవ్రగాయాలు
- క్యాబిన్‌లో చిక్కుకున్న బస్సు డ్రైవర్
- కాపాడిన స్థానికులు
- లారీ డ్రైవర్ పరిస్థితి విషమం



బస్సు డ్రైవర్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

దామెర: వేగంగా వచ్చిన ఓ లారీ.. ఆర్టీసీ బస్సును ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం ఉదయం హనుమకొండ జిల్లా దామెర మండలం ఒగ్లాపూర్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పరకాల డిపోకు చెందిన ఏపీ 36 జడ్ 0256 నంబర్‌గల ఆర్టీసీ బస్సు బెల్లంపల్లి నుంచి హనుమకొండకు వెళ్తోంది. హనుమకొండ నుంచి పరకాల వైపునకు వస్తున్న టీఎస్ 07 యూసీ 8979 నంబర్‌గల లారీ ఒగ్లాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై బస్సును ఎదురుగా ఢీకొంది. దీంతో బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా ముందుకు పడ్డారు. ఈ సమయంలో బస్సులో 57 మంది ప్రయాణికులు ఉండగా సుమారు ఏడుగురికి తీవ్రగాయాలు కాగా, మరో 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కావడంతో డ్రైవర్ భద్రయ్యలో క్యాబిన్‌లో ఇరుక్కున్నాడు. పోలీసులు, స్థానికులు సుమారు 20 నిమిషాల పాటు శ్రమించి అతడిని బయటకు తీశారు. అదే విధంగా లారీ డ్రైవర్, ఆర్టీసీ బస్సు డ్రైవర్‌తోపాటు మరో ఐదుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలు కావడంతో 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. స్వల్పగాయాలైన వారిని దామెర క్రాస్‌లోని ఎస్ఎస్ఆర్ అపోలో రీచ్ ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. కాగా, లారీ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. జాతీయ రహదారిపై ప్రమాదం జరగడంతో రహదారికి ఇరువైపులా కిలోమీటర్లమేర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో ఎస్సై రాజేందర్ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఘటనా స్థలికి పరకాల ఏసీపీ జూవ్వ శివరామయ్య, పరకాల రూరల్ సీఐ శ్రీనివాస రావు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బస్సు కండక్టర్ బాస్కర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

హత్య కేసులో ఇద్దరి రిమాండ్

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్య కేసులో మరో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం బచ్చన్నపేట పోలీస్ స్టేషన్‌లో నర్మెట సీఐ నాగబాబుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రామకృష్ణయ్య హత్యకు సహకరించిన గోపాల్‌నగర్ చెందిన వస్తం ధర్మయ్య, వస్తం జగన్నాథంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసు విచారణను వేగవంతం చేస్తున్నామని, త్వరలోనే మరికొంత మందిని కూడా అరెస్ట్ చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రవణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని బంధం..

- గంట వ్యవధిలోనే అన్నదమ్ముల మృతి



కొమురయ్య గౌడ్ (ఫైల్) సదానందం గౌడ్ (ఫైల్)

ఖిలా వరంగల్: ఒకే తల్లికి జన్మించిన అన్నదమ్ముల అనుబంధం చాలా గొప్పది. అన్న కాలుకి ముల్లుకు చ్చుకుంటే తమ్ముడు.. తమ్ముడి కంట్లో నలుసు పడితే అన్న విలవిలాడుతారు. కష్టసుఖాల్లో ఇరువురు పాలు పంచుకుంటూ అన్యోన్యంగా ఉంటారు. అలాంటి వీరి బంధాన్ని ఎవరూ విడదీయలేరు. చివరకు మరణం కూడా. దీనికి నిదర్శనమే ఈ ఘటన. వరంగల్ గణేశ్‌నగర్‌కు చెందిన ఉమ్మగాని కొమురయ్య గౌడ్ (80), వరంగల్ ఎల్‌బీనగర్ తిలక్ రోడ్డుకు చెందిన ఉమ్మగాని సదానందం గౌడ్ (65) అన్నదమ్ములు. వీరు గీత (గౌడ) వృత్తిని చేపట్టి కుటుంబాలను చక్కగా పోషించుకునే వారు. వారికి జన్మించిన పిల్లలను ఉన్నతంగా చదివించారు. కుమార్తెలు, కుమారుల వివాహం చేయగా వారు ప్రస్తుతం ఉన్నత స్థానంలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో వృద్ధాప్యంలో తాము సంతోషంగా ఉండాలని కోరుకునే సమయాన ఇటీవల అన్నదమ్ములు అనారోగ్యానికి గురయ్యారు. వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి కొమురయ్య మృతిచెందగా.. గంట వ్యవధిలోనే తమ్ముడు సదానందం తుది శ్వాస విడిచాడు. దీంతో మరణంలోనూ అన్నదమ్ముల బంధం వీడిపోలేదని పలువురు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా, ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే నరేందర్ సోమవారం కార్పొరేటర్ గుండేటి నరేందర్‌తో కలిసి మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

వివాహితపై లైంగిక దాడి

హసన్‌పర్తి: నగరంలోని భీమారానికి చెందిన ఓ వివాహితపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితురాలు సోమవారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భీమారానికి చెందిన సంగాల ప్రవీణ్, శరత్ లైంగిక దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేయూ పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఖిలా వరంగల్: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి.. ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడాడు. ఈ ఘటన వరంగల్ దూపకుంట రోడ్డులోని గిరిప్రసాద్‌నగర్‌లో జరిగింది. స్థానికులు కథనం ప్రకారం వరంగల్ శంభునిపేట గిరిప్రసాద్‌నగర్‌కు చెందిన ఫహీమా, ఆయూబ్(57) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. పిల్లలందరి వివాహాలు అయ్యాయి. ఈ క్రమంలో ఆర్థికంగా ఇబ్బందులతో మనోవేదనకు గురైన ఆయూబ్ సోమవారం ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై సాంబయ్య ఘటనా స్థలిని సందర్శించి ఆత్మహత్యకు గల కారణాలను సేకరించారు. మృతుడి కుమారుడు అక్బర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతర ఏర్పాట్లకు ముందస్తు కార్యాచరణ

- గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్



రెవెన్యూ అతిథిగృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యవతి, జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి

ఎస్ఎస్‌తాడ్వాయి : 2024 ఫిబ్రవరిలో జరుగనున్న మేడారం సమ్మక్క- సారలమ్మ మహాజాతర విజయవంతానికి ముందస్తు కార్యాచరణ చేపడుతున్నామని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. పోడు పట్టాల పంపిణీ అనంతరం మేడారంలోని ఐటీడీఏ గెస్ట్ హౌస్‌లో మహాజాతర ఏర్పాట్లు, నిధుల మంజూరుపై రూపొందించిన ప్రతిపాదనలను కలెక్టర్ కృష్ణ ఆదిత్య.. మంత్రి సత్యవతిరాథోడ్‌కు వివరించారు. రూ.75 కోట్లతో మహాజాతర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు ఇంటి పనిగా భావించి మేడారం మహాజాతరను విజయవంతం చేయాలన్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. సీఎం కేసీఆర్‌ను దీవించాలని వనదేవతలను వేడుకున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం మేడారంలో రూ. కోటి 25లక్షలతో నిర్మించిన రెవెన్యూ అతిథిగృహాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి, అధికారులతో కలిసి ప్రారంభించారు. అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, అధికారులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ అమలు చేయాలి

- మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులకు కేయూ ఎన్టీఓ, నాల్గవ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ వినతి



విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయంలో 2013లో నియామకమైన 80 మంది బోధనేతర, ఇతర ఉద్యోగులకు పీఆర్‌సీ అమలు చేయాలని కేయూ ఎన్టీఓ, నాల్గవ తరగతి సంఘాల బాధ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో విద్యాశాఖ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు వినతి పత్ర అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న బోధనేతర, విశ్రాంత ఉద్యోగులకు పీఆర్‌సీ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం 2021 ఆగస్టులో జీవో జారీ చేసిందన్నారు. దీనికి అనుగుణంగా ఉస్మానియా, కాకతీయ, తెలుగు, శాతవాహన, జేఎన్‌టీయూ మహాత్మా గాంధీ, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ, తెలంగాణ, పాలమూరు విశ్వవిద్యాలయాల్లో అమలవుతుందన్నారు. కాని కేయూలో మాత్రం 2013లో నియామకమైన 80 మంది ఉద్యోగులకు వర్తించడం లేదన్నారు. దీనిపై స్పందించి తమకూ వర్తింపజేయడంతోపాటు యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. అలాగే, ఇవే సమస్యలపై శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేయూ ఎన్టీఓ, నాల్గవ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లకావత్ యాదగిరి, వల్లాల తిరుపతి, మహమ్మద్ అబ్దుల్ శుకూర్, పి. కొమురయ్య, ఎతిరాజుల సతీశ్ బాబు, పి. అంకూశ్ పాల్గొన్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత ఎప్పుడు?

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్



మాట్లాడుతున్న గోవిందు నరేశ్

కేయూ క్యాంపస్: జూలై 8వ తేదీన వరంగల్‌కు వస్తున్న ప్రధాని మోదీ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత ఎప్పుడో చెప్పాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కేయూ అతిథి గృహంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నరేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎస్సీ వర్గీకరణ విషయంలో చొరవ తీసుకుని ప్రధానితో ప్రకటన చేయించాలని కోరారు. కాగా, ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి ఈ నెల 7వ తేదీతో 29 సంవత్సరాలు అవుతుందన్నారు. ఈ సందర్భంగా 29వ ఆవిర్భావ మహాసభను వరంగల్‌లోని ఓ సిటీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభలో ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి కరుణాకర్, కేయూ ఇన్‌చార్జి వడ్డేపల్లి మధుకర్, ఎంఎస్‌పీ జాతీయ నేత కడార్ల నవీన్ చారి, గోవిందు శాంతి కుమార్, ప్రేమ్ కుమార్, దూడపాక వెంకటేష్, జన్నే భాస్కర్, పెండ్యాల నిశాంత్, ప్రశాంత్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చెల్లింపులను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

- ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ: ఆన్‌లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపులను ప్రోత్సహించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు సూచించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని సీజీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరివికాస్‌లో పెండింగ్ ఉన్న సర్వీసులను సకాలంలో మంజూరు చేయాలన్నారు. అలాగే, కాలిన, ఆగిన మీటర్లను మార్చాలన్నారు. సంవత్సరం పైబడిన వర్క్ ఆర్డర్స్ పూర్తయ్యేలా చూడాలన్నారు. సబ్‌స్టేషన్‌ల నిర్వహణ ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. దత్త గ్రామాల సమస్యలు పరిష్కరించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలన్నారు. అక్రమంగా వినియోగిస్తున్న సర్వీసులను గుర్తించి వాటికి మీటర్లు అమర్చడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, వి.సంధ్యారాణి, పి.మోహన్ రెడ్డి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.మోహన్ రావు, సి.ప్రభాకర్, కె.కిషన్, కె.ఎస్.గుట్ట, రాజుచౌహాన్, టీకంసింగ్, రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరీ కె. రమేష్, కంపెనీ కార్యదర్శి కె.వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

రక్తమోడిన రహదారులు..

అతివేగం.. అజాగ్రత్త.. నిర్లక్ష్యం ఫలితంగా రహదారులు రక్తమోడాయి. సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అటవీశాఖ అతిథి గృహం వద్ద ద్విచక్రవాహనాన్ని ఓ స్కూల్ బస్సు ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ఓ యువకుడు, ఇదే జిల్లాలోని జమాండ్లపల్లి బ్రిడ్జి సమీపంలో కారుకు కుక్క అడ్డురావడంతో తప్పించబోయే క్రమంలో వాహనం పొలాల్లోకి దూసుకెళ్లగా వ్యక్తి, హనుమకొండ హంటర్ రోడ్డులో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటనలతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి.

బైక్‌ను మరమ్మతు కోసం తీసుకువస్తుండగా బస్సు ఢీకొని యువకుడు మృతి..



అనిల్‌కుమార్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: తన ద్విచక్రవాహనం పాడైపోగా.. మరమ్మతు చేయించేందుకు తీసుకువస్తున్న క్రమంలో స్కూల్ బస్సు ఢీకొని యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగింది. టౌన్ ఎస్సై గోపి కథనం ప్రకారం మహబూబాబాద్ మండలం లక్ష్మీపురం తండా జీపీ పరిధిలోని గమ్మతండాలో నివాసం ఉండే బానోత్ రాజు.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం రేలకాయలపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ అనిల్‌కుమార్ (19) బంధువులు. అనిల్ కుమార్ వారం క్రితం రాజు ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో తన ద్విచక్రవాహనం పాడవడంతో మరమ్మతు చేయించడానికి ఆటోకు తాడు కట్టి అదే వాహనంపై మహబూబాబాద్‌కు వస్తున్నారు. ఆటో, ద్విచక్రవాహనం జిల్లా కేంద్రంలోని అటవీశాఖ అతిథిగృహం వద్దకు చేరుకోగా వారి వెనుక నుంచి వచ్చిన విజేడమ్ (తక్షశిల) పాఠశాల బస్సు అనిల్‌కుమార్ వాహనాన్ని ఢీకొంది. దీంతో యువకుడు బైక్‌పై నుంచి కిందపడగా.. బస్సు అతడి తలపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బావ బానోత్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

కుక్కను తప్పించబోయి అదుపుతప్పిన కారు.. అపస్మారక స్థితికి వెళ్లి ఒకరు..



శ్రీనివాస్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: కుక్కను తప్పించబోయిన కారు.. అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. రూరల్ ఎస్సై బి.రామ్‌చరణ్ కథనం ప్రకారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన తన్నీరు శ్రీనివాస్ (58).. భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలిసి కొంతకాలంగా వరంగల్‌లోని గిర్మాజీపేట విశ్వకర్మ వీధిలో నివాసం ఉంటున్నారు. వృత్తి రీత్యా జాతకాల రాళ్లు, రోల్డ్‌గోల్డ్ వ్యాపారం చేసే శ్రీనివాస్.. తన కుమారుడు చక్రధర్‌తో కలిసి కారులో మహబూబాబాద్‌కు వచ్చారు. అక్కడ నుంచి భద్రాచలం వెళ్తున్నారు. చక్రధర్ డ్రైవింగ్ చేస్తుండగా శ్రీనివాస్ పక్కనే కూర్చున్నారు. కారు.. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లి బ్రిడ్జి దాటగానే కుక్క అడ్డురావడంతో దానిని తప్పించబోయే క్రమంలో అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో శ్రీనివాస్ అపస్మారకస్థితికి చేరుకోగా చక్రధర్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా శ్రీనివాస్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. ఘటనా స్థలిని రూరల్ ఎస్సై రామ్‌చరణ్, ఏఎస్సై సూరయ్య, పీసీ గౌతమ్ పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న బైక్.. ఇద్దరి దుర్మరణం



యువకుల మృతదేహాలు

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. వరంగల్ గాయత్రీనగర్‌కు చెందిన బొంతు అఖిల్ (23), ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన కొలెపాక శ్రీకాంత్(29).. బైక్‌పై వరంగల్ నుంచి హన్మకొండకు వస్తున్నారు. ఈ క్రమంలో హంటర్‌రోడ్డులోని పెట్రోల్‌పంపు వద్ద వేగంగా వస్తూ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో తీవ్ర గాయాలపాలైన ఇద్దరిని ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. దీనిపై బొంతు అఖిల్ బావ పెరుమాండ్ల అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షూకుర్ తెలిపారు.